క్లుప్తంగా

పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలి



సత్తెనపల్లి: సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, షాపు అద్దెలు చెల్లించిన వారికి శుక్రవారం పుష్పాలతో రసీదులు అందించారు. ఈ సందర్భంగా మేనేజర్ సాంబశివరావు మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి సంబంధించి రెండవ అర్ధ సంవత్సరానికి ఎటువంటి వడ్డీ లేకుండా పన్నులు చెల్లించుకో బడతాయన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

పత్తిలో పంట కోత ప్రయోగాలు



బెల్లంకొండ: మండలంలోని భోధనం రెవెన్యూ గ్రామ పరిధిలోని భూములలో పత్తి పైరులో పంట కోత ప్రయోగాలు నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. రైతులు సత్యాల పవన్ కళ్యాణ్, కొత్త నరసింహారావుల పత్తి పొలంలో పంట కోత నిర్వహించి, పంట దిగుబడి అంచనా వేసినట్లు తెలిపారు. ఈ ప్రయోగంలో ఒక పొలంలో 10–10 మీటర్ల విస్తీర్ణంలో 7.8 కిలో గ్రాములు వచ్చిందన్నారు. మరొక పత్తి పొలంలో నిర్వహించిన ప్రయోగంలో 10–10 మీటర్ల విస్తీర్ణంలో 5.92 కిలో గ్రాములుగా నమోదు అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది వై.శ్యామ్ ప్రకాష్, ఎన్.వి.అయ్యప్ప, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి



సత్తెనపల్లి: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల హెడ్ నర్స్ బంగారు పాప అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలోని గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య అంశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు నెల, నెలా వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, కోడిగుడ్లు తీసుకోవాలని, బలమైన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చన్నారు. బాలింతలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అలాగే పుట్టిన గంటలోనే శిశువుకు ముర్రుపాలు తాగించాలని తెలిపారు. పిల్లలు పుట్టిన వెంటనే పోలియో చుక్కలు, సూది మందులు వేయించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు తదితరులు ఉన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: కార్తిక మాసం పురస్కరించుకొని పట్టణంలోని మాచర్ల రోడ్‌లో గల వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బయో ఉత్పత్తుల విక్రయ దుకాణాల్లో తనిఖీలు

బొల్లాపల్లి: మండలంలో వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయ అధికారులు ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై శుక్రవారం విస్తృత తనిఖీలు చేశారు. రేమిడిచర్ల, గంగుపల్లి గ్రామాల్లో ఎరువులు, పురుగు మందు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. గంగుపల్లి గ్రామంలో ఎరువులు, పురుగు మందుల దుకాణంలో అనధికారంగా విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో 29,294 వివిధ కంపెనీల పురుగు మందులు, రూ. 2.97 లక్షల విలువైన ఎరువులు స్వాధీనం చేసుకున్నారు. రూ.2.45 లక్షల బయో ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రేమిడిచర్ల గ్రామంలో రూ. 2.92 లక్షల విలువైన బయో ఉత్పత్తులను సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జయదేవ్‌రాజన్, వ్యవసాయ శాఖ కార్యాలయం అధికారి సురేష్, అబ్బూరు అంకారావు, వీఆర్వో నన్నేషా, పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గిన ఓటర్లు

- ఎన్నికల నాటితో పోలిస్తే ముసాయిదా జాబితాలో ఓటర్ల తీరిది
- ఈ నెల 28 వరకు ముసాయిదా జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ
- 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారికి దరఖాస్తుకు అవకాశం
- ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు
- జనవరి 6న తుది ఓటర్ల జాబితా విడుదలకు యంత్రాంగం కసరత్తు



బీఎల్వోలతో సమీక్ష చేస్తున్న తహసీల్దార్ కేపీస్ చక్రవర్తి(ఫైల్)

సత్తెనపల్లి: నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్ల జాబితా–2025 ప్రత్యేక సవరణ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఇప్పటికే ముసాయిదా జాబితాను ప్రచురించారు. మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే తాజా జాబితాలో నియోజకవర్గంలోని పట్టణంతో పాటు ప్రతి మండలంలోనూ ఓటర్ల సంఖ్య స్వల్పంగా తగ్గింది. నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణంలో 593, సత్తెనపల్లి రూరల్ మండలంలో 794, ముప్పాళ్ళ మండలంలో 348, రాజుపాలెం మండలంలో 476, నకరికల్లు మండలంలో 749 వెరసి 2,960 ఓట్లు తగ్గాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ముసాయిదా జాబితా ప్రకారం 2,39,087 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,17,113 మంది, మహిళలు 1,21,960 మంది, ఇతరులు 14 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 4,847 మంది అధికంగా ఉన్నారు.

గత నెల 29న విడుదల చేసిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ ప్రకారం నియోజకవర్గంలోని ఓటర్లు...

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సత్తెనపల్లి టౌన్	22,855	24,461	06	47,322
సత్తెనపల్లి రూరల్	29,773	31,124	01	60,898
ముప్పాళ్ళ	17,333	18,090	01	35,424
రాజుపాలెం	20,554	21,449	04	42,007
నకరికల్లు	26,598	26,836	02	53,436
మొత్తం	1,17,113	1,21,960	14	2,39,087

అభ్యంతరాలపై విచారణ

నూతన ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటి సర్వే నిర్వహించారు. మృతులు, వలస ఓటర్ల వివరాల తొలగింపుతో పాటు 2025 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారి నుంచి కొత్తగా ఓటు హక్కు నమోదుకు ఫారం–6 దరఖాస్తులు స్వీకరించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన క్లెయిమ్‌లపైనా విచారణ చేపట్టారు. ఆ మేరకు చేసిన సవరణలతో గత నెల 29న అన్ని పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా జాబితాలు ప్రచురించారు. వీటిపై వచ్చిన అభ్యంతరాలు, మార్పులు, చేర్పుల కోసం వచ్చిన వినతులపై విచారణ చేపట్టేందుకు బీఎల్వోలు సిద్ధమయ్యారు. ఈ విషయమై నియోజకవర్గంలోని తహసీల్దార్ కార్యాలయాల్లో సమీక్షలు నిర్వహిస్తున్నారు. జనవరి 6న తుది ఓటర్ల జాబితా విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

యువత నిరాసక్తత

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం. కానీ ఈ హక్కు పొందేందుకు యువత నిర్లిప్తంగా ఉంది. 18–19 సంవత్సరాల మధ్య వయసు కలిగిన యువతకు ఓటు నమోదుపై అవగాహన లేకపోవడం, అనాసక్తత కారణంగా ఓటు హక్కు నమోదు చేసుకోవడం లేదు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల్లో ఈఆర్వో, ఏఈఆర్వోల ఆధ్వర్యంలో 'స్వీప్' కార్యక్రమం నిర్వహణకు ప్రణాళిక రూపొందించారు.

ప్రత్యేక శిబిరాల నిర్వహణ

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, కొత్త దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 28 వరకు గడువు ఇచ్చారు. దీంతో పాటు అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఓటరు చేర్పులు, తొలగింపులు, సవరణలకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. వచ్చిన వినతులను విచారించి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బెల్లంకొండ: నేడు శనివారం మండలంలోని బెల్లంకొండ, పాపాయపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాలలో విద్యుత్ మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నట్లు ఏఈ పవన్ కుమార్ తెలిపారు. అదే విధంగా మండలానికి వచ్చే 33 కేవీ విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కారణంగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సత్తెనపల్లి: పట్టణంలో రెండవ శనివారం దృష్ట్యా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ నెల 9న సత్తెనపల్లి పట్టణం అంతా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ టీబీ కిరణ్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

మాచర్ల: రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి శుక్రవారం తెలిపారు. మాచర్ల శ్రీశైలం రోడ్‌లో గల స్వామి వివేకానంద సేవాశ్రమంలో ఆదివారం ఉదయం 7గంటల నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ కోర్సులో చేరాలనుకునేవారు బయోడేటా ఫామ్స్‌తో తమ కార్యాలయంలో హాజరు కావాలన్నారు.

జీవన ఎరువులతో కాలుష్యాన్ని నివారించవచ్చు



మాట్లాడుతున్న అమరావతి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రారెడ్డి

అమరావతి: పంటలలో జీవన ఎరువులను వాడటం వల్ల వాతావరణ కాలుష్యాన్ని అరికట్టటమే కాకుండా నేల నుంచి మొక్కకు సంక్రమించే తెగుళ్లను నివారించవచ్చని అమరావతి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రవీంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం అమరావతి, ధరణికోట గ్రామ సచివాలయాలలో నరసరావుపేట జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీవన ఎరువులైన రైజోబియం, అజటోబ్యాక్టర్, అజోస్పైరిల్లం వంటి బ్యాక్టీరియాలు నేలలోని పోషకాలను మొక్కకు అందించటంలో సహాయపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్సీ డీడీఏ ఎం.శివకుమారి మాట్లాడుతూ శనగ పంట విత్తన శుద్ధికి రైజోబియం వాడటం శ్రేష్టమన్నారు. జీవన ఎరువులు నత్రజనిని స్థిరీకరించి మొక్కలకు అందిస్తాయన్నారు. ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించి జీవన, సేంద్రియ ఎరువులు వాడటం వల్ల రైతులకు ఖర్చు తగ్గుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అఘ్నాస్త్రం, ఘన, ద్రవ జీవామృతం గురించి వివరించారు. శనగ సాగు చేసే రైతులు విత్తన శుద్ధి చేసుకుంటే వేరుకుళ్లు తెగులును నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అహ్మద్, ఆయా గ్రామాల వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డీబీఆర్సీ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న డీబీఆర్సీ రీజనల్ కో ఆర్డినేటర్

నకరికల్లు/రాజుపాలెం: దళితులు, వెనుకబడిన తరగతుల వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు డీబీఆర్సీ పనిచేస్తుందని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామంలోని ఎస్టీ చెంచుకాలనీ వాసులకు అలాగే రాజుపాలెం మండలంలోని గణపవరం ఎస్టీ కాలనీలో 26 కుటుంబాలకు డీబీఆర్సీ ఏరియా కో ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం అధ్యక్షతన శుక్రవారం 15 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన బలహీన వర్గాల వారిని గుర్తించి ఆదుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీబీఆర్సీ ఏరియా కో ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం, సిబ్బంది పాల్గొన్నారు. సహాయం అందుకున్న కుటుంబాల వారు కృతజ్ఞతలు తెలిపారు.

అపార్‌పై ప్రతి కళాశాల శ్రద్ధ వహించాలి



వేద జూనియర్ కళాశాలలో అపార్ నమోదుపై సూచనలు చేస్తున్న డీఐఈవో నీలావతి

సత్తెనపల్లి: అపార్‌పై ప్రతి కళాశాల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇంటర్మీడియట్ బోర్డు పల్నాడు జిల్లా అధికారి నీలావతి దేవి అన్నారు. పట్టణంలోని వేద, ఇతర జూనియర్ కళాశాలల్లో ఆమె ఆకస్మికంగా అపార్ నమోదుపై శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఐఈవో నీలావతి మాట్లాడుతూ ఇంటర్‌లో చేరిన ప్రతి ఒక్క విద్యార్థి వివరాలు అపార్‌లో నమోదు చేయాలన్నారు. నమోదు విషయంలో ఇబ్బందులు ఎదురైతే సంబంధిత మండల విద్యా శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. కళాశాలల్లో ఇప్పటి వరకు జరిగిన నమోదుపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆధార్ సంబంధిత సమస్యలు వస్తున్నాయని, వీటిని పరిష్కరించేందుకు త్వరలో సత్తెనపల్లి కళాశాలల్లో ఆధార్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు ఆమె తెలిపారు. ఇంటర్ బోర్డు అధికారి సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ అరుణ కుమారి, ఆఫీస్ సిబ్బంది జ్యోతి, దీప్తి, హర్ష వర్ధిని తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదస్థలంలో అన్నం వెంకటరావు



ప్రమాదస్థలంలో ఆర్టీసీ బస్, బైక్

అమరావతి: మండల పరిధిలోని ధరణికోటకు చెందిన అన్నం వెంకటరావు (54) రోడ్డు ప్రమాదంలో మరణించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం మండలంలోని ధరణికోట గ్రామానికి చెందిన అన్నం వెంకటరావు శుక్రవారం పొలంలో ఉన్న కూలీలకు ద్విచక్ర వాహనంపై తాగునీరు ప్లాస్టిక్ క్యాన్‌లో తీసుకువెళుతున్నాడు. ఈ క్రమంలో జైల్ సింగ్ కాలనీ రోడ్డు నుంచి ఆరుడొంకల బావి సెంటర్‌కు వస్తుండగా ఎదురుగా సత్తెనపల్లి నుంచి అమరావతికి వస్తున్న ఆర్టీసీ బస్ ఢీ కొట్టటంతో రోడ్డుపై పడి తలకు బలమైన గాయమైంది. గ్రామస్తులు చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మరణించాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని భార్య నాగరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అమరావతి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి సీహెచ్‌సీకి తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్‌ను, బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అమరావతి–ధరణికోట శివారులో ఆరు రోడ్లు కలిసే చోట ఆరు వైపుల నుంచి వాహనాలు వేగంగా రావటంతో ఈ సెంటర్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కనీసం ఆర్ అండ్ బీ అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవటం వల్లే ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయని రెండు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మాచర్ల: స్థానిక కేశానుపల్లిలోని ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో 10న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం శుక్రవారం తెలిపింది. పట్టణంలోని జండా చెట్టు బజార్‌లోని ముస్లిం షాదీఖానాలో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి, ఈఎన్‌టీ వైద్య శిబిరం నిర్వహిస్తారన్నారు. ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ షేక్ వసీం మీరా పరీక్షలు చేస్తారన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో రావాలన్నారు.

విద్యుత్ సమస్యలపై 'ఫోన్ ఇన్'లో ఫిర్యాదు

అచ్చంపేట : విద్యుత్ సమస్యలపై పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో అచ్చంపేట మండలం నుంచి శుక్రవారం ఇరువురు తమ సమస్యలపై ఫోన్ ద్వారా విద్యుత్ శాఖ ఎస్ఈ పత్తిపాటి విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. పెదపాలెం గ్రామానికి చెందిన సూదిరెడ్డి హనుమంతరావు తన భార్య రమాదేవి పేరుపై ఈ ఏడాది మార్చిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసానని, స్థంభాలు వేసి, తీగ, ట్రాన్స్‌ఫార్మర్ వేయలేదని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ స్థంబాలు కూడా విరిగిపోయినట్లు చెప్పారు. కొండూరుకు చెందిన నెల్లూరి సైదయ్య మూడు నెలల క్రితం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేస్తే ఇప్పటి వరకు ఎస్టిమేట్లు వేసి నగదు చెల్లించుకోలేదని, వెంటనే తనకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎస్ఈ విజయకుమార్ సాధ్యమైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

క్రోసూరు: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం నైపుణ్య గణన సర్వేపై సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో బి.మహేష్‌బాబు, ఈవోపీఆర్డీ జి.శ్రీనివాసరావు, పెదకూరపాడు, క్రోసూరు స్కిల్స్ సెన్సెస్ కో ఆర్డినేటర్లు ఏ రమ్య పాల్గొని మాట్లాడారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ నైపుణ్య యాప్‌ను భర్తీ చేయటం చూపించారు. అందులో ప్రతి ఇంటిలోని 16 నుంచి 59 వయస్సు గల ప్రతి కుటుంబ సభ్యుడు, సభ్యురాలి వివరాలు యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఏం చదువుతున్నారు, ఎంత వరకు చదివారు, ఏం చేస్తున్నారు, చదవకపోతే ప్రస్తుతం ఏం చేస్తున్నారు, ఏదైనా పని నేర్చుకుంటున్నారా తదితర వివరాలు అడిగి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా డెమోగ్రాఫిక్ ప్రొఫైల్, సోషియో ఎకానమిక్, డిజిటల్ ఎనేబుల్‌మెంట్, ఎంప్లాయిమెంట్, స్కిల్, ఆస్పిరేషన్, మొబిలిటీ ప్రొఫైల్ లాంటివి నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో 15 సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

గురజాల: న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, నాలుగవ అదనపు జిల్లా జడ్జి శరత్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులు వెంటనే జాతీయ లోక్ అదాలత్‌లో సత్వరమే పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులకు సమయంతో పాటు డబ్బులు కూడా ఆదా చేసుకోవచ్చని తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు పోక్సో చట్టంపై అవగాహన



పోక్సో చట్టంపై బ్రోచర్‌తో అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు

రాజుపాలెం: బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలు చూసుకోవాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పోక్సో చట్టం, బేటీ బచావో–బేటీ పఢావో కార్యక్రమాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ మాతా, శిశు సంరక్షణ, కౌమార దశలో వచ్చే మార్పుల గురించి వివరించారు. పోక్సో చట్టం గురించి వివరిస్తూ ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను నివారించేందుకే పోక్సో చట్టం వచ్చిందని వివరించారు. మిషన్ వాత్సల్యపై అవగాహన కల్పించారు. అనంతరం పోక్సో చట్టంపై బ్రోచర్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు దుర్గేష్‌రావు, సీడీపీవో టి.శ్రీలత, అసిస్టెంట్ సీడీపీవో టి.సంతోష్‌కుమారి ఈవోపీఆర్డీ పి.ముక్కంటి, హెచ్‌వీ ఉషారాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా పని చేయాలి

ఎంపీడీవో వై.హనుమారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీవో

బెల్లంకొండ: బాల్య వివాహాలు నిర్మూలించటలో గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరూ కీలక పాత్ర వహించి పనిచేయాలని ఎంపీడీవో వై.హనుమారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో– బేటీ పఢావో, సేవ్ గర్ల్ చైల్డ్ కార్యక్రమాలపై వివిధ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలకు అవగాహన, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, గ్రామాలలో ఎట్టి పరిస్థితులలోనూ బాల్య వివాహాలు జరగకుండా అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అమ్మాయి వయస్సు18 అబ్బాయి వయస్సు 21 సంవత్సరాలు దాటిన తరువాత మాత్రమే వివాహాలు చేయాలని, ఆ దిశగా తల్లిదండ్రులలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం పోక్సో చట్టం, బాలికల హక్కులు, మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి కార్యక్రమాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వనజ, పరిమళ వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటరెడ్డి, వివిధ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులతో పాటు జీవన ఎరువులు వాడాలి

జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి ప్రవీణ్



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి ప్రవీణ్

సత్తెనపల్లి: పంటల సాగులో రసాయన ఎరువులతో పాటు జీవన ఎరువులైన ఫాస్ఫరస్ సాల్యూబ్లిసింగ్ బ్యాక్టీరియా, అజోల్లా, అజటోబాక్టర్, సుడోమోనాస్ వాడాలని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి ప్రవీణ్ అన్నారు. పట్టణంలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు, ముప్పాళ్ళ మండలాల్లో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులకు, బహుళ ప్రయోజన విస్తరణ అధికారులకు క్షేత్ర స్థాయిలో వారి నైపుణ్యం పెంచేందుకు సబ్ డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ ఇన్‌చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ పెట్టుబడి ఖర్చులు తగ్గించి భూమి సారవంతాన్ని కాపాడాలని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయి అధికారులు శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని గ్రామ స్థాయిలో రైతులకు చేరవేయాలని సూచించారు. ఉద్యాన శాఖ అధికారి నవీన్ మిరపలో పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలను తెలియజేశారు. పెదకూరపాడు వ్యవసాయ అధికారి ఐ.శాంతి మొక్కజొన్నలో పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలను తెలిపారు. శిక్షణలో ముప్పాళ్ళ మండల వ్యవసాయ అధికారి ఎం.అరుణ, సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు, ముప్పాళ్ళ మండలాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు, బహుళ ప్రయోజన విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గురజాల కమిషనర్‌గా శ్రీమన్నారాయణ

గురజాల: నగర పంచాయతీ కమిషనర్‌గా వైవీఎల్ శ్రీమన్నారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పిడుగురాళ్ల డీఈ వి.శ్రీనివాసరావును అధికారులు సస్పెండ్ చేశారు. గుంటూరు మునిసిపాలిటీ నందు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వైవీఎల్ శ్రీమన్నారాయణ గురజాల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. పలువురు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఒప్పిచర్లలో వైభవంగా అయ్యప్ప పడిపూజ

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో అయ్యప్పస్వామి పడిపూజా మహోత్సవం గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం అర్ధరాత్రి వరకు వైభవంగా జరిగింది. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పడిపూజలో పాల్గొని అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. బాలకృష్ణ గురుస్వామి తదితరులు అయ్యప్ప పడిపూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేలాది అయ్యప్పమాల ధరించిన స్వాములు పూజలో పాల్గొని అయ్యప్ప స్వామి భజనలలో తరించారు.